క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటఅర్బన్: పట్టణంలోని 220కేవీ /132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లింగారెడ్డిపల్లి, గాడిచర్లపల్లి, కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్రూం కాలనీ, నర్సాపూర్, గుండ్లచెరువు, రంగధాంపల్లి, ప్రాంతాలలో ఉదయం8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో నిలిపివేస్తామని తెలిపారు. సిద్దిపేటఅర్బన్ మండలంలోని పొన్నాల, మిట్టపల్లి 33కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 8నుంచి సాయంత్రం 4వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏడీఈ శ్రీనివాసులు పేర్కొన్నారు. విద్యుత్ స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల తొలగింపు కారణంగా పొన్నాల, ఎన్సాన్‌పల్లి, మిట్టపల్లి, మందపల్లి సబ్ స్టేషన్, డీఎక్స్‌ఎన్, సురభి మెడికల్ కాలేజ్, ప్రభుత్వ మెడికల్ కాలేజ్, సంతోష్‌నగర్, ఇందిరమ్మ కాలనీ, సందీప్‌నగర్‌లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే అధిక లాభం: డీఆర్‌డీఓ


కొనుగోళ్లను పరిశీలిస్తున్న జయదేవ్ ఆర్య

బెజ్జంకి(సిద్దిపేట): సన్న రకాల వడ్లు పండించిన రైతులు కొనుగోలు కేంద్రాలలో విక్రయించి లాభం పొందాలని డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య సూచించారు. వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం జరిగిన ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సన్న వడ్లకు క్వింటాలుకు రూ.2,300లతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం నర్సయ్య, ఏఓ సంతోష్, సీసీ సారయ్య, ఏఈఓ రేణుక పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం


లబ్ధిదారులతో కిరణ్‌కుమార్

మద్దూరు(హుస్నాబాద్): సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అన్నారు. దూల్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామానికి చెందిన బాల్నే కళవ్వ, కళ్లెం కనకలక్ష్మి, సూరంపల్లి ఉమ, కొల్లూరి విక్రమ్‌కు మంజూరైన చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సంద్భంగా మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడే వారికి, అత్యవసర సమయంలో సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బెక్కల్ ఆలయ చైర్మన్ చొప్పరి మల్లేశం, నాయకులు ఉదయ్, కమాలకర్, కిష్టయ్య, రవి పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయానికి గ్రానైట్ వితరణ


మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

చిన్నకోడూరు(సిద్దిపేట): కస్తూరిపల్లిలో ముదిరాజ్ కులస్తులు నిర్మిస్తున్న పెద్దమ్మ దేవాలయానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు రూ.60వేల విలువైన గ్రానైట్‌ను మంగళవారం వితరణ చేశారు. దీంతో ఆయనకు ముదిరాజ్ సంఘం సభ్యులు, మాజీ సర్పంచ్ పద్మస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. హరీశ్‌రావు సహకారంతో గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందని, అన్ని వర్గాల వారికి కుల సంఘాల భవనాలు పూర్తయ్యాయన్నారు.

జోగిని శ్యామల సందడి


బోనంతో ఆలయానికి వెళ్తున్న శ్యామల

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సాయిపల్లిలో జోగిని శ్యామల సందడి చేశారు. గ్రామంలో కొమ్మూరి సంస్థానం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ జమదగ్ని కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఆమె పాల్గొని బోనం ఎత్తుకొని ఆలయం వద్దకు వెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో జనగామ నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కొమ్మూరి సంస్థానం కుటుంబ సభ్యులు, రెడ్డి సంఘం సభ్యులు, వివిధ నాయకులు పాల్గొన్నారు.


చిన్నకోడూరు(సిద్దిపేట): ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు


సిద్దిపేటజోన్: రాజ్యాంగ ప్రవేశికను చదివి వినిపిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్


జగదేవ్‌పూర్‌లో నివాళులర్పిస్తున్న బాలేషం గౌడ్ తదితరులు


సభలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రియాంక



హుస్నాబాద్: మాట్లాడుతున్న జడ్జి కృష్ణతేజ్


హుస్నాబాద్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భిక్షపతి


సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



దౌల్తాబాద్(దుబ్బాక): ఎమ్మార్వో, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నివాళులు.. ప్రజ్ఞాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద..

ప్రజాస్వామ్యానికి దిక్సూచి రాజ్యాంగం

- ఘనంగా వేడుకలు
- అంబేద్కర్ చిత్రాపటాల వద్ద నివాళులు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, వివిధ పార్టీల కార్యాలయాల్లోను 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వివిధ పార్టీల ప్రతినిధులు, సంఘాల నేతలు, న్యాయమూర్తులు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు పాల్గొని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రాపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం 1950 నవంబర్ 26న అమలులోకి వచ్చిందని వివరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. దేశ ప్రజలందరికీ సమాన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను అందించేలా రాజ్యాంగాన్ని రూపొందించారని, రాజ్యాంగం ప్రజాస్వామ్య పరిరక్షణకు దిక్సూచిగా నిలిచిందని వక్తలు పేర్కొన్నారు.

'దళిత బంధు' ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ చైర్మన్ వెంకటయ్య

దుబ్బాకరూరల్/దుబ్బాక: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే దళితుల అభివృద్ధి కోసం దళిత బంధు పథకం ద్వారా రూ.10లక్షలు ఇచ్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రాజక్కపేట గ్రామంలో మంగళవారం డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుతాయన్నారు. కార్యక్రమంలో విగ్రహదాత బిట్ల వెంకటేశం, గుర్రాల శ్రీనివాస్, భీంసేన ఆస బాబు, రజనీకాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం హబ్సిపూర్‌లో ఈజీఎస్, సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కరశర్మ, ఏపీడీ శివాజీ, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, నాయకులు అస్క రవి, రాజలింగంగౌడ్, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిని వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. పలు వార్డులలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. మెరుగైన వైద్యసేవలు అందిస్తూ మంచి గుర్తింపు తేవాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఈజీఎస్ నిధులు వృథా చేయొద్దు

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్)/చేర్యాల(సిద్దిపేట): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులను వృథా చేయవద్దని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఉపాధి హామీ పనుల జాతర కార్యక్రమంలో మంగళవారం కిష్టంపేటలో పామ్ పాండ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈజీఎస్ నిధులను సక్రమంగా వినియోగించిందన్నారు. మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి వెళ్తున్న కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, అందుకు అవసరమైన అంచనావేసే పనులు ప్రారంభించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేత, పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ, ఎంపీడీఓ కుమారస్వామి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీఓ శ్రీనివాసవర్మ, మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. మద్దూరు మండలంలోని సలాఖపూర్, దూల్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన పశువులపాక షెడ్లు, పామ్ పాండ్ల నిర్మాణనికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. చేర్యాల మర్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేత, వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, సంతోష్‌కుమార్, యాదగిరి, సుమలతమల్లేశం, పద్మవెంకట్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చేర్యాల మండలం దానంపల్లిలో రూ.44లక్షల వ్యయంతో చేపడుతున్న గ్రంథాలయ భవనం, గ్రామ పంచాయతీ కార్యాలయాల నిర్మాణం, సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కృష్ణాగౌడ్, కరుణాకర్, మహబూబ్‌అలీ, ఏపీఓ మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రజాపాలన విజయోత్సవాలు


జగదేవ్‌పూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

జగదేవ్‌పూర్(గజ్వేల్)/బెజ్జంకి(సిద్దిపేట)/తొగుట(దుబ్బాక): ప్రజాపాలన ఏడాది విజయోత్సవాలను జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప గ్రామంలో ఎంపీడీఓ యాదగిరి మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రం ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్న సందర్భంగా ఈ విజయోత్సవాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నర్సరీని ప్రారంభించి, ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం జగదేవ్‌పూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మాజీ ఎంపీపీ బాలేషంగౌడ్ తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకి మండలంలో ఉత్సవాలను మండల ప్రత్యేక అధికారి వరదారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, ఏఈ సమ్మయ్య ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తొగుట మండలంలోని వెంకట్రావుపేటలో నిర్వహించిన విజయోత్సవ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రాజు పాల్గొని ఉపాధి హామీ పనులు ప్రారంభించారు. కార్యదర్శి రవీందర్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ప్రవీన్, నారాయణ, శ్రీనివాస్, రవి, ప్రశాంత్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం మండలంలోని తిగుల్‌నర్సాపూర్ గ్రామానికి చెందిన గోల్లెని ప్రవీణ్(19) గత 22న బైక్‌పై స్నేహితుడితో కలిసి కొండపోచమ్మ ఆలయం నుంచి ఎల్లమ్మ దేవాలయం వైపు వెళ్తున్న క్రమంలో టాటా ఏసీ వాహనం ఢీకొట్టింది. దీంతో గాయపడిన ప్రవీణ్‌ను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పథకాలను విస్మరిస్తున్న ప్రభుత్వం

మిరుదొడ్డి(దుబ్బాక): సంక్షేమ పథకాలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు ఎలా నిర్వహిస్తోందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కమలాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం వారు మాట్లాడుతూ అసత్య ప్రచారంతో ప్రజలను మోసంచేసి గద్దె నెక్కిన రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను అటకెక్కించిందారని విమర్శించారు. లింగం, బాపురెడ్డి, సత్యనారాయణ, అహ్మద్, నర్సింహులు, సత్యనారాయణ, భైరయ్య, బాబు, ఐలయ్య, కిష్టయ్య, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కూతురుకు సీపీ అభినందన


జయహాసినిని అభినందిస్తున్న సీపీ అనురాధ

గజ్వేల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన గజ్వేల్ కానిస్టేబుల్ సంతోష్‌కుమార్ కూతురు జయహాసినిని సీపీ అనురాధ అభినందించారు. పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఆ బాలికను శాలువాతో సత్కరించారు. డిసెంబర్ 10 నుంచి 14 వరకు వారణాసిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్న నేపథ్యంలో మంచి ప్రతిభ కనబరచి జిల్లాకు పేరు తేవాలని ఆ కాంక్షించారు. అదనపు డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీలు మల్లారెడ్డి, మధు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చివరి పొలం వరకు సాగునీరు

- త్వరగా డిస్ట్రిబ్యూటరీ కాలువలు నిర్మిస్తాం
- ఆర్డీఓ రామ్మూర్తి


గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టు కింద నిర్మించనున్న డిస్ట్రిబ్యూటరీ కాలువల వల్ల చివరి పొలాల వరకు సాగునీరు అందుతుందని ఆర్డీఓ రామ్మూర్తి చెప్పారు. మండలంలోని జనగామలో మంగళవారం భూ సేకరణపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్మించనున్న డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. కాలువల నిర్మాణానికి రైతులందరూ సహకరించాలని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే నేరుగా రెవెన్యూ అధికారులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏసీపీ సతీశ్, తహసీల్దార్ అనంతరెడ్డి, నీటిపారుదలశాఖ డీఈ కరుణశ్రీ, భూ సేకరణ నాయబ్ తహసీల్దార్ అరవింద్, ఆర్ఐ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి జమున, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల మాక్ పోలింగ్ సందడి



అక్కన్నపేట: మాక్ పోలింగ్‌లో విద్యార్థినులు

అక్కన్నపేట(హుస్నాబాద్)/దుబ్బాక: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు సందర్భంగా మండలంలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శైలజరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటింగ్ విధానంపై వారికి అవగాహన కల్పించారు. నామినేషన్లు దాఖలు చేయడం, బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు, ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు జారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు చంద్రమొగిలి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట జిల్లా పరిషత్ పాఠశాలలో మాక్ ఎలక్షన్ నిర్వహించారు. హెచ్‌ఎం సాదత్ అలీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విధానం, భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉపాధ్యాయులు శ్రీకాంత్, నరేశ్, బత్తుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఏడుగురు పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.12,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తొగుట(దుబ్బాక): మండలంలోని తుక్కాపూర్ మదిర కాశవాడలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. నిధులు మంజూరుకు కృషిచేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చెరుకు విజయ్‌రెడ్డి, పీఆర్ ఏఈ రామకృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, కొండల్‌రెడ్డి, స్వామి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ

కొండపాక(గజ్వేల్): కొండపాకకు చెందిన దొమ్మాట మాజీ ఎమ్మెల్యే రాంచంద్రారెడ్డి కుటుంబాన్ని మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. ఇటీవల రాంచంద్రారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

◆ ఎంబ్రాయిడరీ కిట్‌ల పంపిణీ

మద్దూరు(హుస్నాబాద్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు కొండల్‌రెడ్డి పిలుపునిచ్చారు. దూళ్మిట్ట మండల పరిధిలోని జాలపల్లిలో మహిళ సంఘాలకు చెందిన 30మంది సభ్యులకు మంగళవారం ఆయన ఎంబ్రాయిడరీ కిట్‌లను పంపిణీ చేశారు.

◆ విద్యార్థులకు చట్టాలపై అవగాహన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని షీ టీమ్ సభ్యులు అన్నారు. స్థానిక సిటిజన్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, ఫోక్సో, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా షీ టీమ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే డయల్ 100, 87126 67434నంబర్లు సమాచారం అందించాలని సూచించారు.

◆ హక్కులను కాపాడుకుందాం

సిద్దిపేటకమాన్: ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకుందామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. బస్టాండ్ చౌరస్తాలో ట్రేడ్ యూనియన్, సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కనకరాజు, రవీందర్, జనార్దన్, చంద్రం మల్లేశం, సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

◆ అందరి కృషితో గ్రామాల అభివృద్ధి

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని జిల్లా ఇన్‌చార్జి పశువైద్యాధికారి, మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం పొట్లపల్లిలో ప్రజాపాలన విజయోత్సవంలో పాల్గొని మాట్లాడారు. గ్రామానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను దుర్వినియోగం చేయకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ దివ్యాంగ కూలీలకు సన్మానం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటకుంట పంచాయతీ పరిధిలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో వంద రోజులు పూర్తి చేసుకున్న దివ్యాంగులకు కార్యదర్శి సుచరిత, కాంగ్రెస్ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు రాజునాయక్ ఘనంగా సన్మానించారు. లింగంపల్లి సారయ్య, మాలోతు శంకర్‌నాయక్, భూక్య కొమురెల్లి, బాల్య తదితరులు పాల్గొన్నారు.

◆ ద్విచక్ర వాహనం వేలం

చేర్యాల(సిద్దిపేట): దూళ్మిట్ట మండలంలో నిర్వహించిన దాడుల్లో గుడుంబాను తరలిస్తూ పట్టుబడిన హోండా డియో ద్విచక్ర వాహనానికి స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో 28న వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆ వాహనం విలువ రూ.25వేలు ఉంటుందన్నారు. వేలంలో పాల్గొన దల్చినవారు 25శాతం నగదు రూపంలో జమచేసి పాల్గొనాలని సూచించారు.

◆ విజయవంతం చేయండి

దుబ్బాకటౌన్/గజ్వేల్: గజ్వేల్‌లో 1, 2వ తేదీల్లో జరగనున్న సీపీఎం జిల్లా 3వ మహా సభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం దుబ్బాకలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతారన్నారు. సమావేశంలో నవీన, భాస్కర్, సాధిక్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గజ్వేల్‌లో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను బండ్ల స్వామి ఆవిష్కరించారు.